సాక్షి
హనుమకొండ

గురువారం । 4 । జులై । 2024



విద్యార్థుల భద్రత గాలికేనా?
విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. - 8లో▸



ఆరుగురు మిలీషియా సభ్యుల అరెస్ట్
ఆరుగురు మిలీషియా సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ బుధవారం వెల్లడించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /27^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా, మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

సీఎంఆర్ పక్కదారి!

సర్కారు ధాన్యంతో రైస్‌మిల్లర్ల వ్యాపారం..
- రూ.201 కోట్లకుపైగా విలువైన ధాన్యం మాయం?
- కేసముద్రంలోని మూడు మిల్లుల్లో బయటపడ్డ బాగోతం
- జనగామ, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో ఇదే తంతు?
- సీఎంఆర్ స్థానంలో రేషన్ బియ్యం.. జోరుగా సాగుతున్న వ్యాపారం



సాక్షిప్రతినిధి, వరంగల్:

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద మరాడించి ఇవ్వాల్సిన కొందరు రైస్‌మిల్లర్లు ఆ ధాన్యంతో దందా చేస్తున్నారు. ప్రభుత్వానికి అటు ధాన్యం నిల్వలు చూపకుండా.. ఇటు బియ్యం ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తున్నారు. ఫలితంగా నిర్ణీత సమయంలో పౌరసరఫరాలశాఖ, భారత ఆహార సంస్థలకు సీఎంఆర్ బియ్యం చెల్లించకుండా సర్కారు సొమ్ముతో రియల్ ఎస్టేట్, ఇతరత్రా వ్యాపారాలు చేస్తూ రూ.కోట్లు వెనుకేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం కేటాయించిన 45 రోజుల్లో బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. పౌరసరఫరాల శాఖలోని కొందరు అధికారులు 'మామూలు'గా తీసుకుంటుండటంతో అలా జరగడం లేదు. దీంతో రూ.కోట్ల విలువ చేసే ధాన్యం పక్కదారి పట్టిస్తూ కొందరు మిల్లర్లు సర్కారు ఖజానాకు రూ.కోట్లు ఎగవేస్తున్నారు. జనగామ జిల్లాలో ఈ దందా యథేచ్ఛగా జరుగుతుండగా.. ఇటీవల అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహిస్తుండటంతో బండారం బట్టబయలు అవుతోంది.

వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు.. పొంతనలేని సీఎంఆర్ లెక్కలు..

సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని పలు జిల్లాల్లో రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొద్దిరోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఈ తనిఖీలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఐదు రోజుల కిందట మహబూబాబాద్ జిల్లా కేసముద్రం విలేజ్ గ్రామంలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయ్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మూడు మిల్లుల్లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. మణికంఠ రైస్‌మిల్లులో 12,360 క్వింటాళ్లు, వీటి విలువ సుమారు రూ.3.79 కోట్లు, మారుతి రైస్ మిల్లులో 43,464 క్వింటాళ్ల ధాన్యం, వీటి విలువ సుమారు రూ.13.80 కోట్లు ఉంటుంది. మహాదేవ రైస్ మిల్లులో 58,070 క్వింటాళ్ల ధాన్యం మాయం కాగా, వీటి విలువ సుమారు రూ.12.79 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వానికి బియ్యం అందించకపోవడం, మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడంతో యజమానులపై కేసు నమోదు చేసినట్లు కూడా వెల్లడించారు. కాగా ఉమ్మడి వరంగల్‌లో బుధవారం నాటికి జరిపిన తనిఖీల్లో రూ.201 కోట్లకు పైగా విలువైన బియ్యం ఆచూకీ దొరకనట్లు సమాచారం.

అన్ని జిల్లాల్లో ఇదే తంతు..

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరించింది. ఈ ధాన్యాన్ని అధికారులు కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలిస్తారు. మిల్లుల్లో మర ఆడించి వచ్చిన బియ్యాన్ని తిరిగి సివిల్ సప్లయ్ అధికారులకు (ప్రభుత్వానికి)అందించాలి. కొంతమంది వ్యాపారులు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యంలో కొంత మేర ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కేజీకి రూ.5 నుంచి రూ.8 వరకు తక్కువ ధరకు కొని సీఎంఆర్ విధానం ద్వారా తిరిగి సివిల్ సప్లయ్ గోదాములకు తరలించి ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు దారి మళ్లించినట్లు ప్రచారం జరుగుతోంది. రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తూ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు టీంలుగా ఏర్పడి రైసుమిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తుండటంతో బండారం బయట పడుతోంది.

జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్త



సమస్యల పరిష్కారంలో ముందంజ

- అంకితభావంతో పనిచేసిన ప్రజాప్రతినిధులు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- వరంగల్ అర్బన్ జెడ్పీ పాలకవర్గానికి వీడ్కోలు

హన్మకొండ: క్షేత్రస్థాయిలోని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారంలో వరంగల్ అర్బన్ జిల్లా ప్రజాప్రతినిధులు ముందున్నారని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో వరంగల్ అర్బన్ జెడ్పీ పాలక మండలి వీడ్కోలు సమావేశం సీఈఓ ఎం.విద్యాలత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజల కోసం పనిచేశారని పాలక మండలిని కొనియాడారు. అదనపు కలెక్టర్ రాధికాగుప్త మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించారన్నారు. జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పొగడ్తలకు పొంగిపోవద్దని, విమర్శలకు కుంగిపోవద్దని, తాను అదే పాటించానన్నారు. పదవులు వస్తాయి...పోతాయి కాని ఎదిగిన కొద్ది ఒదిగి ఉండాలన్నారు. తాను ఎంత ఎదిగినా ఒదిగే ఉన్నానన్నారు. తాను గ్రహించిన దానిలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల కోణంలో పని చేసిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రజోపయోగకర పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. సీఎంగా కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా నిలిపారన్నారు. వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ తామంత ఒక కుటుంబంలా కలిసి ఉన్నామని, కలిసి పనిచేశామన్నారు. చైర్మన్ సుధీర్ కుమార్, జిల్లా అధికారులు తమకు సంపూర్ణ సహకారం అందించారన్నారు. జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గ హయాంలో 22వ సర్వసభ్య సమావేశంలో 23 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారన్నారు. కారుణ్య నియామకాల కింద 54 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని, 79 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని, 279 అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌బాబు, వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు చాడా సరిత, పిట్టల శ్రీలత, సునీత, లాండిగ కల్యాణి, వంగ రవి, బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, వరంగల్ డీసీసీబీ డైరెక్టర్ గున్‌రెడ్డి రాజేశ్వర్‌రావు, ఎంపీపీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

6 నుంచి శాకంబరీ ఉత్సవాలు



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవస్థానంలో ఈనెల 6 నుంచి నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలను విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఉదయం దేవాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్పొరేషన్, రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖల సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి మాట్లాడుతూ మొదటి రోజు సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు అమ్మవారిని కూరగాయలతో అలంకరించనున్నట్లు తెలిపారు. వివిధ క్రమాల్లో ఉదయం, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు మాట్లాడుతూ 21వ తేదీన జరిగే మహాశాకంబరీ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సమావేశంలో సిబ్బంది ఆలయ పర్యవేక్షకుడు అద్దంకి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్ బజార్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న కుక్, అసిస్టెంట్ కుక్‌పోస్టుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిన 11 నెలల కాలానికి లేదా విద్యాసంవత్సరం ముగింపు వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత మార్కులు, అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అందించాలని, దరఖాస్తు ఫారాలు ఆ పాఠశాలలోనే అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

9 నుంచి ఇంటర్వ్యూలు

కాళోజీ సెంటర్ : టామ్‌కామ్ ఫెడరల్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ ఆఫ్ జర్మనీ వారి భాగస్వామ్యంతో జర్మన్ భాషా శిక్షణ, ట్రిపుల్ విన్ ప్రాజెక్ట్ కింద జర్మనీలో ప్లేస్‌మెంట్ కోసం నిర్వహించే నర్స్ ఇంటర్వ్యూలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్‌ఎం/బీఎస్సీ పూర్తి చేసి, 21నుంచి 38సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం 99088 30438, 89190 47600 నంబర్ల ద్వారా సంప్రదించాలని లేదా జూలై 9 నుంచి జూలై 17వ తేదీ వరకు హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ ది ప్లాజా, 2వ అంతస్తులో జరిగే ఇంటర్వ్యూకు నేరుగా హాజరుకావచ్చని తెలిపారు.

వ్యాపారి నుంచి డబ్బులు ఇప్పించాలి



రామన్నపేట : వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని కనకమహాలక్ష్మి ట్రేడర్స్ నిర్వాహకుడు ఇమ్మడి మధుకర్ తమకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడని, అతనినుంచి డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం రైతులు మట్టెవాడలోని అతని బంధుమిత్రుల ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. తమనుంచి కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించకపోవడంతోపాటు చాలామంది వ్యాపారుల నుంచి వసూలు చేసినడబ్బులు కూడా ఇవ్వకుండా సుమారు రూ.10కోట్లకు ఐపీ పెట్టి ఉడాయించాడని ఆరోపించారు. మట్టెవాడలో అతను కడుతున్న భవన నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి ఆందోళన కారులను శాంతింపజేసి పంపించి వేశారు.

పాఠశాల, కళాశాలలో సీట్ల భర్తీకి..

న్యూశాయంపేట: వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్దిలోని మైనార్టీ(బాలుర) గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న నాన్ మైనార్టీ కోటా సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి తెలిపారు. ఐదో తరగతిలో ఎస్టీ(1), ఓసీ(1), ఆరో తరగతి ఎస్సీ(1), బీసీ(1), ఎనిమిదో తరగతి ఎస్టీ(1), బీసీ(2), తొమ్మిదో తరగతి బీసీ(1), ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎస్టీ(1), బీసీ(2), బైపీసీలో ఎస్సీ(1), ఎస్టీ(1), బీసీ(2) సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 6వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎంపీటీసీలను సన్మానించిన ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఆశించిన అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిందని ఆరోపించారు. అధికారులు నిజాయితీగా పనిచేయకుంటే బదిలీపై వెళ్లిపోవచ్చని అన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్, దేవునూరు ఇనుపరాతి గుట్టలను ఏకో టూరిజం చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించినట్లు వివరించారు. మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీలు ప్రజల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎంపీపీ నిమ్మ కవిత, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, వైస్ ఎంపీపీ బండారు రవీందర్, ఎంపీఓ కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలను మించిన గౌరవం లేదు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సన్మానం అనంతరం పదవీ కాలం ముగిసిన ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: ప్రజల మన్ననలను మించిన గౌరవం మరొకటి లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన ఎంపీపీ తడక రాణిశ్రీకాంత్, జెడ్పీటీసీ లాండిగె కల్యాణిలక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం కమలాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కమలాపూర్‌తోపాటు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. అధికారం, పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, పదవి ఉన్నా, లేకపోయినా ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అనంతరం పదవీ కాలం ముగిసిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాటం శైలజఅశోక్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, ఎంపీడీఓ గుండె బాబు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం



వరంగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో గురువారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. బుధవారం వరకు మండల పరిషత్ అధ్యక్షుల కాలపరిమితి ముగిసింది.వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కలెక్టర్లు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ జిల్లా పరిధిలోని భీమదేవరపల్లి మండలానికి ఎం.శ్రీనివాసరావు (అడిషనల్ డీఆర్‌డీఓ), ధర్మసాగర్‌కు కె.నాగపద్మజ (డీఆర్‌డీఓ), ఎల్కతుర్తికి జి.నాగేశ్వర్‌రావు (డీసీఓ), హసన్‌పర్తికి మేన శ్రీను (డీఎండబ్ల్యూఓ), ఐనవోలుకు శ్రీనివాసరావు (డీడీ, గ్రౌండ్‌వాటర్), కమలాపూర్ జి.రాంరెడ్డి (జిల్లా ఉపాధి అధికారి)ని ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ పి.ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్ జిల్లాలో..

చెన్నారావుపేట మండలానికి డాక్టర్ ఎం.బాలకృష్ణ (జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి), దుగ్గొండికి ఆర్.శ్రీనివాసరావు (జిల్లా ఉద్యాన శాఖ అధికారి), గీసుకొండ సురేశ్ (ఎస్సీ కార్పొరేషన్ ఈడీ), ఖానాపురం సౌజన్య (డీటీడబ్ల్యూఓ), నల్లబెల్లి గోవిందరాజన్ (సీపీఓ), నర్సంపేటకు భాగ్యలక్ష్మి (డీఎస్‌డీఓ), నెక్కొండకు ఉషాదయాళ్ (జిల్లా వ్యవసాయ అధికారి), పర్వతగిరి సంజీవరెడ్డి (డీసీఓ), రాయపర్తికి పి.నరేశ్‌కుమార్‌నాయుడు (జిల్లా మత్స్యశాఖ అధికారి), సంగెం పుష్పలత (బీసీ సంక్షేమ అధికారి), వర్ధన్నపేట సురేశ్ (ఏడీ అగ్రికల్చర్)ను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ సత్యశారదాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వరంగల్ జిల్లా నుంచి హనుమకొండ జిల్లా పరిషత్‌లో విలీనం కాని పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, శాయంపేట మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు జాబితాను రూపొందించి వరంగల్ జిల్లా పరిషత్‌కు పంపించినట్లు సమాచారం. వరంగల్, హనుమకొండ జిల్లా పరిషత్‌లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించలేదు.

బాలల సంరక్షణ సామాజిక బాధ్యత

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



మర్కజీ జంక్షన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: బాలల సంరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ పదో విడత పోస్టర్లను సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో బాలకార్మికులతో పాటు వేధింపులకు గురైన బాలలను గుర్తించాలని సూచించారు. పిల్లలపై ఎవరైనా కఠినంగా వ్యవహరిస్తే వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల బాలల సంరక్షణ సమితి చైర్మన్లు దామోదర్, వసుధ, ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారులు ప్రవీణ్, రాజు, రవికాంత్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్లు భాస్కర్, శ్వేత, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, డైరెక్టర్ సిస్టర్ సహాయ, షేర్ ఎన్జీఓ ప్రతినిధులు శిరీష, వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏహెచ్‌టీయూ సిబ్బంది ఫసియొద్దీన్, మల్లేశ్, భాగ్యలక్ష్మి శ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జంక్షన్ల పరిశీలన

హనుమకొండ ప్రాంతంలోని పలు ట్రాఫిక్ జంక్షన్లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం పరిశీలించారు. ముందుగా మర్కజీ పాఠశాల వద్ద మూసివేసిన ట్రాఫిక్ జంక్షన్‌ను సందర్శించారు. ఈ జంక్షన్ తిరిగి పునఃప్రారంభిస్తే ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కలిగే సానుకూల అంశాలను ట్రాఫిక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై స్పందించిన సీపీ మర్కజీ జంక్షన్ వద్ద డివైడర్లను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ జంక్షన్ నుంచి వెళ్లే వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఏఆర్ పోలీస్ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ అదాలత్ జంక్షన్‌ను పరిశీలించారు. నగరంలోని పలు జంక్షన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వాహనదారులకు కనిపించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు షుకూర్, నాగబాబు, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సిబ్బంది ఉన్నారు.

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

బాధ్యతలు స్వీకరించిన మహిళా పోలీస్‌స్టేషన్–2, వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, రామకృష్ణ, సంతోష్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ సేవలందించాలని సూచించారు.

తిష్టవేసిన ఉద్యోగులకు స్థానచలనం

బదిలీలపై నిషేధం ఎత్తివేత



వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ జీఓ జారీ చేయడంతో ప్రభుత్వ విభాగాల్లో తిష్ట వేసిన ఉద్యోగులకు స్థాన చలనం తప్పనిసరైంది. జూలై 5నుంచి 20వ తేదీ వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. దీంతో పంచాయతీరాజ్, వ్యవసాయ, దేవాదాయ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల్లో నాలుగేళ్లకు పైగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు బదిలీ కానున్నారు. పంచాయతీరాజ్ పరిధిలోని జిల్లా, మండల పరిషత్ కార్యాయాలల్లో కొందరు పదేళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. అదే విధంగా వ్యవసాయ శాఖ పరిధిలో మార్కెట్లలో ఒకేచోట పనిచేస్తున్న వారు బదిలీ బాట పట్టక తప్పదని తెలిసింది. అయితే ప్రభుత్వం నాలుగేళ్లు ఒకే చోట పనిచేస్తున్న వారు ఎంత మంది ఉన్నప్పటికీ క్యాడర్‌ల వారీగా 40 శాతం మందిని మాత్రమే బదిలీ చేయాలని నిబంధన పెట్టింది. దీంతో ఎక్కువకాలం ఒకే చోట పనిచేసిన వారికి మాత్రమే బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఉదాహరణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 14 మార్కెట్ కమిటీల్లో 33సూపర్ వైజర్ పోస్టులు ఉన్నాయి. ఇందులో నాలుగేళ్లు దాటిన వారు 15మంది ఉన్నప్పటికీ 12మంది మాత్రమే బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. సీనియారిటీ వారీగా జాబితాలు తయారు చేస్తే ఏ శాఖలో ఏ క్యాడర్‌లో ఎంత మంది బదిలీ అవుతారని విషయం తెలుస్తుందని విభాగాల ఉన్నతాధికారులు తెలిపారు.

మా భూమి రిజిస్ట్రేషన్ ఎక్కడ?

- మండలాల మార్పుతో క్రయవిక్రయదారుల అయోమయం
- ముందస్తు సమాచారం అందించని అధికారులు
- ఐనవోలుకు దూరాన్ని పెంచిన వరంగల్ ఆర్వో



కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసే భూక్రయవిక్రయదారులు మండలాల మార్పుతో 20 కిలోమీటర్ల పైన ప్రయాణించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాజీపేట అర్బన్: సారు.. మా భూమి రిజిస్ట్రేషన్ ఏ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేస్తున్నారు అంటూ భూక్రయవిక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జీఓ 257 ప్రకారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ మండలాల మార్పునకు శ్రీకారం చుట్టారు. కాగా, జూన్ 29న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మండలాల మార్పు అంటూ ఉత్తర్వులను జారీచేయగా.. జూలై 1 నుంచి అమలు చేస్తున్నారు.

సమాచారం లేక సతమతం..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మండలాలు మారాయనే సమాచారం లేక భూక్రయవిక్రయదారులు అయోమయంలో కొట్టుమిట్టాడతున్నారు. వరంగల్ ఆర్వోలోని వరంగల్ మండలాన్ని వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్‌లో కొంతభాగాన్ని, ఐనవోలు మండలాన్ని వరంగల్ ఆర్వోకు బదిలీ చేశారు. జూలై ఒకటో తేదీన యథావిధిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తమ భూమి రిజిస్ట్రేషన్ నిమిత్తం వెళ్లగా ఇక్కడ కాదు.. అక్కడికి వెళ్లండి.. మీ మండలం మా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మార్చారు అని అధికారులు చెప్పారు.

ఐనవోలు ప్రజలకు ప్రయాణ భారం..

గతంలో వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునే ఐనవోలు మండలాన్ని వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మార్చారు. దీంతో గతంలో కేవలం 5 నుంచి 10

మార్కెట్ విలువల్లో అస్పష్టత..

వరంగల్ ఆర్వో, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జిల్లాలకు అనుగుణంగా రాత్రికి రాత్రే మండలాల మార్పు చేపట్టారు. మండలాలను మార్చారు కానీ, మార్కెట్ విలువలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడంలో వెనుకబడ్డారు. దీంతో భూ క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇందుకు నిదర్శనం మూడు రోజుల తర్వాత వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం రెండు దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం గమనార్హం.

మారిన మండలాల వివరాలు ఇలా..

వరంగల్ ఆర్వో : కాజీపేట, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు మండలాలు.

వరంగల్‌ఫోర్ట్: ఖిలావరంగల్ మండలం, వరంగల్ మండలంలోని గిర్మాజీపేట, రామన్నపేట గ్రామాలతోపాటు ఆయా గ్రామాల మున్సిపల్ డివిజన్లు.

వరంగల్ రూరల్: గీసుకొండ , సంగెం మండలాలు, వరంగల్ మండలంలోని దేశాయిపేట, లక్ష్మీపురం, పైడిపల్లి, కొత్తపేట, మట్టెవాడ, ఏనుమాముల గ్రామాలతో పాటు మున్సిపల్ డివిజన్లు.

క్లుప్తంగా

స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఎంపికలు



స్టాండింగ్ బ్రాడ్ జంప్ చేస్తున్న హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు బుధవారం జరిగిన ఎంపిక పోటీల్లో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ. అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి, వారికి మరింత ప్రోత్సాహం అందించడంలో 'శాట్' ముందంజలో ఉంటుందన్నారు. హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో రెండు రోజులు వసతి గృహ ప్రవేశాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రతిభ ఆధారంగా హాస్టల్‌లో అర్హత సాధిస్తారని తెలిపారు. మొదటి రోజు వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచ్‌లు గౌస్, స్వర్ణలత, రవికుమార్, నర్సింగ్‌రావు, రాజేష్, సుధాకర్, సంతోష్‌చారి, ఆయుష్‌యాదవ్, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, విష్ణువర్ధన్, నవీన్‌కుమార్, కె రాజు తదితరులు పాల్గొన్నారు.

17 మంది ఖైదీల విడుదల

వరంగల్: వరంగల్ సెంట్రల్ జైలు పరిధిలోని మామునూరు ఓపెన్ జైలులోని 17మంది ఖైదీలను విడుదల చేసినట్లు సూపరింటెండెంట్ టి.కళాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి సెంట్రల్‌జైలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జైలు శాఖ చరిత్రలో మొదటిసారి రాష్ట్ర వ్యాప్తంగా 213 మంది ఖైదీలు విడుదలైనట్లు తెలిపారు. విడుదలైన ఖైదీలకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, వరంగల్ డీఐజీ సంపత్, డిప్యూటీ జైలర్ దేవేందర్, జైళ్లశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌డీ' ప్రాసెసింగ్ ఫీజు తగ్గింపు

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఇంజనీరింగ్, లా ఎడ్యుకేషన్, ఫార్మసీ, కామర్స్ విభాగాల్లో పరిశోధకులకు ఇక నుంచి ప్రాసెసింగ్ ఫీజును రూ.3వేల నుంచి రూ.2వేలకు తగ్గించారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పీహెచ్‌డీ థీసెస్ చేంజ్ ఆఫ్ టైటిల్, టాఫిక్ చేంజ్, ఎక్స్‌టెన్షన్, రీ-రిజిస్ట్రేషన్, టైమ్‌బార్ పర్మిషన్, సూపర్ వైజర్ చేంజ్/అలాట్‌మెంట్ ఆఫ్ కో సూపర్‌వైజర్ లేదా కేర్ టేకర్ ఆఫ్ సూపర్‌వైజర్ లాంటివాటికి ప్రాసెసింగ్ ఫీజు ఇక నుంచి రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుంది. పీహెచ్‌డీ పరిశోధకులు ఏటా అడ్మిషన్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. అంతేగాకుండా ఆరు నెలలకోసారి ప్రోగ్రెసివ్ రిపోర్టు సమర్పించాలి. పరిశోధకులు ఆలస్యంగా రెన్యూవల్ చేసుకున్నప్పుడు నిర్దేశిత ట్యూషన్ ఫీజుతోపాటు 20 శాతం అదనంగా జరిమానా చెల్లించాలని నిర్ణయించారు. గతంలో ఎక్కువ మొత్తంలో జరిమానా డబుల్ (వందశాతం) విధించే వారు. ఇప్పుడు దాన్ని తగ్గించి ఇక 20 శాతం జరిమానా విధించాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అప్రూవల్ మేరకు ప్రాసెసింగ్ ఫీజును, అలాగే జరిమానా విధంపు తగ్గిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులిచ్చారు.

విద్యార్థుల భద్రత గాలికేనా?

- ఈ ఏడాది డ్రైవర్లకు శిక్షణ కరువు
- నిద్రావస్థలో రవాణా శాఖ
- ప్రమాదం జరిగితేగాని పట్టించుకోరా?
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఖిలా వరంగల్ : రవాణా శాఖ.. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులకు దగ్గర కావొస్తున్నా స్కూల్ బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇవ్వకుండా మీనామేషాలు లెక్కిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రమాదాల నివారణపై దృష్టిసారించిన రవాణాశాఖ ఏటా విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఆయా విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేది. అయితే ఈ ఏడాది డ్రైవర్లకు ఎలాంటి శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై 21 రోజులు గడుస్తున్నా శిక్షణకు వరంగల్ జిల్లా ఆర్టీఏ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడం లేదు

గతంలో స్కూల్ బస్సు నడిపే డ్రైవర్లు శిక్షణకు హాజరుకాకపోతే ఆయా బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయబోమని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేసేవారు. దీంతో విధిగా యాజమాన్యాలు సైతం తమ బస్సు డ్రైవర్లను శిక్షణకు పంపించేవి. శిక్షణ అనంతరం బస్సులు నడిపేలా చర్యలు తీసుకునేవారు. గతేడాది బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చే సమయానికి జిల్లాలో బస్సుల ఓనర్స్ అసోసియేషన్, వరంగల్ రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్రైవర్లకు మెరుగైన శిక్షణ కార్యక్రమం చేపట్టింది. అయితే ఈ ఏడాది ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



ప్రైవేట్ స్కూల్ బస్సు దిగుతున్న విద్యార్థులు

ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేసే డ్రైవర్లు, క్లీనర్ల వివరాలు

వరంగల్ జిల్లాలో డ్రైవర్లు 428, క్లీనర్లు 218 మంది, హనుమకొండ జిల్లాలో డ్రైవర్లు 1172, క్లీనర్లు 511 మంది ఉన్నారు. మొత్తం ప్రైవేట్‌విద్యా సంస్థల బస్సుల డ్రైవర్లు 1600, క్లీనర్లు 729 ఉన్నారు. జనగామ జిల్లాలో స్కూల్ బస్సుల డ్రైవర్లు 128, క్లీనర్లు 36 మంది ఉండగా..భూపాలపల్లి జిల్లాలో 156 డ్రైవర్లు, క్లీనర్లు 42 మంది, ములుగు జిల్లాలో డ్రైవర్లు 102 మంది, క్లీనర్లు 26 మంది, మహబూబాబాద్ జిల్లాలో డ్రైవర్లు 163 మంది, క్లీనర్స్ 63 మంది ఉన్నట్లు డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బండి భాస్కర్ తెలిపారు.

నిబంధనలపై అవగాహన శూన్యం..

శిక్షణలో భాగంగా అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా వినియోగించాలో ఫైర్ ఆఫీసర్ల సమక్షంలో అవగాహన కల్పించేవారు. వివిధ వాహనాల్లో వినియోగిస్తున్న టెక్నాలజీ, విడిభాగాల పనితీరు, ప్రమాదాలకు దారితీసే కారణాలు, తక్షణ నివారణ చర్యలపై శిక్షణ ఇచ్చేవారు. ప్రథమ చికిత్స కిట్ల ఆవశ్యకత, బ్రేక్‌లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంజన్, గేర్ వ్యవస్థ పనితీరు, అత్యవసర ద్వారం ప్రాముఖ్యం, తదితర అంశాలపై ప్రధానంగా శిక్షణ ఇచ్చేవారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి శిక్షణ లేకుండానే ఆయా విద్యాసంస్థల బస్సులు ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లపై పరిగెత్తుతున్నాయి. దీనిపై ఉమ్మడి జిల్లా రవాణాశాఖ అధికారులు పునరాలోచన చేసి విద్యా సంస్థల్లో పనిచేసే బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు చొరవ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో స్కూల్ బస్సుల వివరాలు

జిల్లా	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ చేసుకున్నవి	చేయించుకోవాల్సినవి
వరంగల్	352	294	58
హనుమకొండ	920	794	126
జనగామ	103	92	11
భూపాలపల్లి	130	107	23
ములుగు	95	71	24
మహబూబాబాద్	155	127	28
మొత్తం	1755	1485	270

డ్రైవర్లకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి



బస్సు కండీషన్, విద్యార్థుల భద్రతపై డ్రైవర్లకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి. బస్సు ఎక్కగానే డ్రైవర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేగ నియంత్రణను వివరించాలి. కానీ ఈ ఏడాది విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు ఆర్టీఏ అధికారులు ఎలాంటి శిక్షణ నిర్వహించలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నాం.

- బండి భాస్కర్, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధి

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



విద్యా సంస్థల బస్సులు రోడ్డెక్కిన తనిఖీ చేయడం లేదు. బస్సుల్లో నిబంధనలు ఎంత మేరకు పాటిస్తున్నారో చూసేవారు కరువయ్యారు. డ్రైవర్లకు కంటిచూపు, లైసెన్స్, ఆరోగ్య విషయాలు తెలుసుకోకుండా బస్సుల రోడ్డుపై రయ్..రయ్ మంటున్నాయి. తనిఖీలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. విద్యార్థుల భద్రత కోసం స్కూల్ బస్సులపై నిర్లక్ష్యం వీడాలి.

- గద్దం నాగార్జున, విద్యార్థి సంఘాల ప్రతినిధి, వరంగల్

డ్రైవర్లకు శిక్షణ ఇస్తాం



డ్రైవర్లకు శిక్షణ ఇవ్వకుండానే ఈఏడాది బస్సులు ప్రారంభమైన విషయం వాస్తవమే. ఓనర్స్ అసోసియేషన్, రవాణాశాఖ సంయుక్తంగా డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. ఇప్పటికే స్కూళ్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాం. డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం. ప్రమాదాలకు తావులేకుండా అనుభవజ్ఞులైన డ్రైవర్ల నియమాకానికి చర్యలు తీసుకున్నాం.

- డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, డీటీసీ హనుమకొండ, వరంగల్

అధునాతన పరిజ్ఞానంతో ఎస్పీఎం షెడ్

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ములుగు రోడ్డు ఎస్పీఎం షెడ్ నిర్మాణం చేపడుతున్నట్లు టీఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం డైరెక్టర్లు, నోడల్ ఆఫీసర్స్, డీఈలు, ఎమ్మార్టీ, టెక్నికల్ ఆఫీసర్స్‌తో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ పాల్గొని మాట్లాడారు. ప్రతీ సర్కిల్‌లో ఒక ఎస్పీఎం షెడ్‌గా నిర్మాణం చేపట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లతో నాణ్యతాప్రమాణాలతో కూడిన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. సబ్ స్టేషన్‌లో విధిగా ప్రొటెక్షన్ టీం తనిఖీలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఎల్టీ హెచ్‌టీ, సిటీ సర్వీస్‌లను తనిఖీ చేయాలన్నారు. రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని, విద్యుత్ సంబంధిత ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 18004250028 లేదా 1912 అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు తిరుమలరావు, రాజుచౌహాన్, గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, డీఈ,ఐటీ కే.అనిల్‌కుమార్, శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్ష

- 6వ తేదీ నుంచి ప్రారంభం
- నగరంలో 5 కేంద్రాలు
- హాజరుకానున్న 7,500 మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్ : 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని 8 విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఈడీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, తదితర పీజీ కోర్సుల్లో 45 సబ్జెక్టుల్లో ప్రవేశాలకుగాను తెలంగాణ స్టేట్ కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్టు (టీజీ-సీపీగెట్) ఈనెల 6వ నుంచి 15 వతేదీ వరకు నిర్వహించబోతున్నారు. ఈప్రవేశ పరీక్షను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించబోతోంది. ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలోనే ఈ ప్రవేశ పరీక్షలు ఉంటాయి. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు టీజీ సీపీగెట్ కన్వీనర్, ప్రొఫెసర్ పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. మోక్షిత కంప్యూటర్ సెంటర్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, నోబుల్ టెక్నాలజీ సొల్యూషన్స్, ఎర్రగట్టుగుట్టలోని అయాన్ డిజిటల్, జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 6 నుంచి 15వరకు ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్నింటిలో కలిపి మొత్తం 7,500 మంది విద్యార్థులు హాజరుకాబోతున్నారు. రోజూ మూడు సెషన్లలో ఈ ప్రవేశ పరీక్షలు ఉంటాయి. ఒక్కోసెషన్‌లో ఏఏ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయని టైంటేబుల్‌లో వివరాలున్నాయి. ఆయా పరీక్షల తేదీల్లో మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు విద్యార్థులను గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారు. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 1 గంట నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఒంటిగంటకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. సాయంత్రం 4.30 గంటల నుంచి ఆరుగంటల వరకు పరీక్ష ఉంటుంది. 4.30 గంటలకు గేట్లు మూసివేస్తారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు బయోమెట్రిక్ పద్ధతిలో అటెండెన్స్ కూడా తీసుకుంటారు అందుకే గంటన్నర ముందుగానే చేరుకోవాల్సింటుందని కన్వీనర్ తెలిపారు. ప్రతి సబ్జెక్టు ప్రవేశ పరీక్షకు 100 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ పద్ధతిలోనే ఉంటుంది. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్‌టికెట్‌తోపాటు ఐడీ ప్రూఫ్ ఆధార్ లేదా ఇతర ఏదైనా ఐడీప్రూఫ్‌ను పరీక్ష కేంద్రానికి తప్పనిసరిగా తీసుకు రావాలని పాండురంగారెడ్డి తెలిపారు.

6న జాబ్ మేళా

కాశీబుగ్గ సెంటర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 6న వరంగల్ ములుగు రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. 'దృష్టి' ఐటీ సెక్యూరిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండల్లో స్టోర్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్, సీసీటీవీ టెక్నీషియన్‌గా పనిచేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు 21 నుంచి 30 సంవత్సరాలలోపు ఉండి స్టోర్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్‌కు డిగ్రీ పాసై, సీసీటీవీ టెక్నీషియన్‌కు ఎస్సెస్సీ పాసై ఉన్న యువతి, యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6న ఉదయం 11గంటల వరకు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి రావాలన్నారు. వివరాలకు 93461 05589 ఫోన్ నంబర్ ద్వారా నూతన్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు మిలీషియా సభ్యుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ములుగు ఎస్పీ శబరీశ్



మిలీషియా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న జిలెటిన్ స్టిక్స్, వైర్లు

ములుగు: ఆరుగురు మిలీషియా సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ తెలిపారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో బుధవారం అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. వెంకటాపురం(కె) మండలం విజయపురి కాలనీ సమీపంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆరుగురు అనుమానాస్పద స్థితిలో పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకుని విచారించగా ప్రభుత్వ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో కొద్ది సంవత్సరాల నుంచి మిలీషియా సభ్యులుగా పని చేస్తున్నామని ఒప్పుకున్నారు. ఈ క్రమంలో మావోయిస్టు అగ్రనాయకుల ఆదేశాల మేరకు సాధారణ ప్రజలు, పోలీసులు అడవిలోకి రాకుండా కాలిబాటల వెంబడి మందు పాతరలు అమర్చడానికి వచ్చామని పేర్కొన్నారు. గతంలో బూబీ ట్రాప్స్ ఏర్పాటు చేశామని నేరం అంగీకరించారని ఎస్పీ తెలిపారు. కాగా, అరెస్ట్ అయిన వారిలో బాడిసే సురేశ్, మడకం సందీప్, గట్టుపల్లి సంతోశ్, కట్టం అర్జున్ , మడకం రాము , బాడిసె రవి ఉండగా వారి నుంచి 12 జిలెటిన్ స్టిక్స్, ఆరు బ్యాటరీలు, ఒక డిటోనేటర్, 10 మీటర్ల నలుపు - ఎరుపురంగు ఎలక్ట్రికల్ వైర్లు, ఆరు విప్లవ సాహిత్యాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. కాగా, వెంకటాపురం(కె) మండలం బేధం గుట్ట అటవీ ప్రాంతంలో మందుపాతర పేలి వీఆర్‌కే పురం గ్రామానికి చెందిన డర్ర సునీత తీవ్రంగా గాయపడిన కేసు, వెంకటాపురం(కె) మండలం సీతారాంపురం- తడపాల కాలిబాటలో మందు పాతరలు అమర్చిన ఘటనలో, వెంకటాపురం(కె) మండలంలోని పాలెం ప్రాజెక్ట్ -చెలిమెల కాలిబాటలో మందు పాతరలు అమర్చిన ఘటనలో, వెంకటాపురం(కె) మండలం ముకునూరుపాలెం - చెలిమెల కాలిబాటలో మందు పాతరలు అమర్చిన ఘటనతోపాటు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో పలురకాల మందు పాతరలు, బూబీ ట్రాప్స్ అమర్చిన ఘటనలో వీరు నిందితులుగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

బంగారం దుకాణాల్లో చోరీ ముఠా అరెస్ట్

పాలకుర్తిటౌన్: బంగారం దుకాణాల్లో నగల చోరీలకు పాల్పడుతున్న ముఠాను పాలకుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం పాలకుర్తి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ముంగిమడుగు, ఫకీర్ తండాలకు చెందిన భూక్య బుజ్జి, భూక్య కైలా, గుగులోత్ మీరా, భూక్య అమ్ములు ఈజీ మనీ కోసం చోరీలకు తెరతీశారు. ఈ క్రమంలో ఈ నెల 1న మండల కేంద్రంలోని రజినీకాంత్ జ్యువెల్లర్స్ వర్క్‌షాప్, షాబుజీ బంగారం దుకాణాల్లో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చామని నమ్మబలికి ప్రవేశించారు. దుకాణదారులు కావాల్సిన నగలను చూపుతుండగా వారిని మాటల్లో పెట్టి ఆభరణాలు చోరీ చేశారు. దుకాణదారులకు చిక్కకుండా అక్కడి నుంచి ఉడాయించారు. అపరిచిత వ్యక్తులు నగలు దొంగిలించారని గుర్తించిన దుకాణదారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి వారి వద్ద నుంచి రెండు జతల వెండి పట్టీలు, నాలుగు బ్రాస్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పలు ప్రాంతాల్లోని జ్యువెల్లర్స్, బట్టల దుకాణాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై సాయి ప్రసన్న, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పోరాట యోధుడికి వందనం..

- దొడ్డి కొమురయ్య అమరత్వానికి నేటితో 78 ఏళ్లు
- నేడు కడవెండిలో కొమురయ్య వర్ధంతి సభ
- హాజరుకానున్న సీపీఐ రాష్ట్ర, జిల్లా నేతలు

దేవరుప్పుల : భూమి.. భుక్తి.. వెట్టిచాకిరి విముక్తి కోసం ఉవ్వెత్తున సాగిన ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. నిప్పురవ్వలా ఎగిసి తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి రాచరికపు పాలనకు చరమగీతం పాడేలా దోహదపడిన ఈ పోరులో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. ఈ అమరత్వానికి నేటితో 78 ఏళ్లు నిండుకోనున్నాయి. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు అండగా జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వామ్య పెత్తందారి వ్యవస్థ ప్రజలను పీల్చి పిప్పి చేసే క్రమంలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం విస్నూర్ దేశముఖ్ రాపాక రామచంద్రారెడ్డి, తల్లీ జానమ్మ దొరసాని, బాబుదొర అకృత్యాలు పెల్లుబికి వెట్టిచాకిరీ, లేవి వసూళ్లు అమలవుతున్న తరుణం ఇది. రెండో ప్రపంచ యుద్ధం (1944) తలెత్తిన తరుణంలో భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ పాలకులకు మద్దతు ఉన్న నిజాంరాజు ఆహారపు ధాన్యాల సేకరణకు తన పాలనాయంత్రాంగాన్ని అప్రమత్తం చేశాడు. పాలనాయంత్రాంగం ధాన్యం నిల్వచేసే భూస్వామ్యులను వదిలేసి రైతుల నుంచి బలవంతపు వసూళ్లకు తెరలేపింది.

రైతు ఉద్యమం కాస్త సాయుధ పోరాటానికి అంకురార్పణ ..

దేశ్‌ముఖ్‌లు, దొరలను ఎదురించడం ఊహకందని రోజుల్లో కడవెండి కేంద్రంగా జానమ్మ దొరసాని గడీలో 'లేవి' పేరిట సేకరించి ఉంచిన వందలాది పుట్ల ధాన్యాన్ని అధికారులకు చూపించినా లాభం లేకపోయింది. ఆమె ఆకృత్యాలు, వెట్టిచాకిరీ నిర్మూలనకు ఆంధ్రమహాసభ సందేశంతో సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టారు. అయినా దిగిరాని దొరసాని ఆగడాలను అంతమొందించేందుకు నల్లా నర్సింహులు తదితర నేతల ఆధ్వర్యంలో 'గుప్తల' సంఘాన్ని ఏర్పరిచి ప్రతిదాడులకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే 1946 జూలై 4 వ తేదీన ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, దొడ్డి కొమురయ్య, మల్లయ్య, మామిడాల యాదగిరి, జంపాల లింగయ్య, రేషపల్లి కొండయ్య, అస్నాల నర్సోజీ, దావిద్‌రెడ్డి తదితరులు గుప్తల సంఘం ఆధ్వర్యంలో దున్నేవాడికి భూమి.. 'లేవీ' ధాన్యం సేకరణ నిలిపివేయాలి... జై ఆంధ్రమహాసభ..ఎర్రజెండా జై అంటూ దొరసాని గడీని చుట్టుముట్టేందుకు బొడ్రాయి వద్దకు ప్రదర్శనగా చేరారు. ఈ ప్రదర్శనను చూసి బెంబేలెత్తిన మిస్కీని అలీ నేతృత్వంలో దొరల గుండాలు, నిజాం పోలీసులు కాల్పులు జరపగా ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమురయ్య మృతి చెందాడు. మిగతా సభ్యులు తీవ్ర గాయాలపాలయ్యారు. అప్పటికే రావినారాయణరెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న సత్యాగ్రహాలు, సహాయ నిరాకరణ ఉద్యమాలు కాస్త మహా ఉద్యమంగా ఉధృతమై రక్తానికి రక్తం.. ప్రాణానికి ప్రాణంలా మారి తెలంగాణ రైతాంగ సాయుధ పోరుకు అంకురార్పణతో రాచరికపు పాలనకు చరమగీతం పాడింది విధితమే. చారిత్రాత్మక ఉద్యమ చిహ్నానికి సీపీఐ ఆధ్వర్యంలో భారీ స్మారక స్తూపం, భవనం నిర్మించారు.



కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం

సీపీఐ ఆధ్వర్యంలో సంస్మరణ సభ

కొమురయ్య వారసత్వం పునికిపుచ్చుకొనే క్రమంలో ఏటా మాదిరి కడవెండిలో నేడు ఉదయం 10 గంటలకు స్మారక స్తూపం వద్ద సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య తెలిపారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర నాయకురాలు పోతునూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఏఐయూటీసీ భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి, సొప్పరి సోమయ్య తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'ఆస్కార్' గ్రంథాలయం ప్రారంభం

- సొంత నిధులతో స్వగ్రామంలో నిర్మించిన ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్



చల్లగరిగలో ప్రారంభానికి సిద్ధమైన ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహిత కనుకుంట్ల చంద్రబోస్ సొంతంగా నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు జిల్లా గ్రంథాయాల కార్యదర్శి టి. శ్రీలత తెలిపారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని ఆస్కార్ గ్రంథాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినీ గేయ రచయిత చంద్రబోస్ తన సొంత నిధులు రూ.36 లక్షలతో ఆస్కార్ గ్రంథాలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ గ్రంథాలయంలో ఫర్నిచర్‌తోపాటు పలు రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

భర్త మోసం చేశాడని.. భార్య ఆత్మహత్య

- డీఎస్సార్ జెండాల్‌తండాలో ఘటన
- నా చావుకు భర్త సురేశ్ కారణం
- మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్



అనూష (ఫైల్)

మరిపెడ రూరల్ : పెళ్లి అయినా మరో పెళ్లి చేసుకుని తనను భర్త మోసం చేశాడని భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్సార్ జెండాల్‌తండా గ్రామ పంచాయతీ పరిధి ఆముదాలగడ్డ తండాలో చోటు చేసుకుంది. మరిపెడ ఎస్సై సంతోశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన బాదావత్ కోట్యా, భారతి దంపతుల కుమార్తె అనూష (20), అదేతండాకు చెందిన వివాహితుడు (అప్పటికే పెళ్లి అయిన వ్యక్తి) భూక్య సురేశ్ రెండు సంవత్సరాల క్రితం ప్రేమించుకున్నారు. సంవత్సరం క్రితం వివాహం చేసుకున్నారు. అయితే భర్త మొదటి భార్య జ్యోతి, సురేశ్ మధ్య గొడవలు నిరంతరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో అనూషను మొదటి భార్య బంధువులు పలుమార్లు తీవ్రంగా కొట్టారు. దీంతో ఆరు నెలల క్రితం అనూష కుటుంబ సభ్యులు పంచాయితీ నిర్వహించారు. ఇప్పటి నుంచి అనూష, సురేశ్ కలుసుకోవద్దని పంచాయితీలో పెద్ద మనుషులు తీర్పు చెప్పారు. అయినా సురేశ్.. అనూషను వెంబడించడం, కత్తితో పలుమార్లు దాడికి యత్నించాడు. దీంతో మనస్తాపానికి గురైన అనూష బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మరిపెడ ఎస్సై సతీశ్ ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి కోట్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సంతోశ్ పేర్కొన్నారు.

నా చావుకు భర్త సురేశే కారణం..

మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ' సురేశ్ నన్ను నమ్మించి మోసం చేశాడు. అందుకు నేను చనిపోతున్నా. నీ భార్య ఉంది అని చెప్పిన నా మాట వినలేదు. అయినా నన్ను చాలా టార్చర్ పెట్టాడు. అందుకు నేను చనిపోతున్నా. నా చావుకు కారణం భూక్య సురేశ్, నాకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగవద్దు' అని సూసైడ్ నోట్‌లో ఉంది.